# మగాళ్ళకి మూడు నోములు

అలనాడు.. ఆంధ్రులారుగురు అతి తీవ్రమయిన తపస్సుకు పూనుకున్నారు. తీవ్రాతి తీవ్రంగా అతగా పక్కవారితో పన్నెత్తి పలుకకుండా. ఘోరాతిఘోరంగా అనగా స్నానాలు కూడా చేయకుండా క్రూరాతి క్రూరంగా అంటే జుత్తు కూడా ముడేసుకోకుండా- వాళ్ళలా ఏళ్ల తరబడి తపస్సు చేస్తుండే సరికి ఇంద్రుడు తన సీటుకెక్కడ ఎసరొస్తుందోనని గందరగోళం పడిపోయి రంభకు కబురంపాడు. రక్షించమన్నాడు.

"వాళ్ల దీక్ష పగలగొట్టేసి నన్ను కాపాడు. అసలే ఆంధ్రులంటే సీట్లకెసరు పెట్టేవాళ్ళని వ్యుత్పత్త్యర్థం" అని మొర పెట్టుకున్నాడు.

"ఓ రాధా ఇద్దరు కృష్ణుల ఈక్వేషన్ కష్టం. అలాంటిది ఒక రంభ, ఆరు:సరు హీరోలు అనేది అత్యంత కష్టము, అసాధ్యము. నేను ఒంటరిగా పోను" అనేసిందామె.

అప్పుడు ఆమెకి తోడుగా మేనక, తిలోత్తమ, ఊర్వశిలాంటి స్టార్స్‌నీ ఇద్దరు ఎక్స్ట్రాలను ఇచ్చి ఓ రుషీ ఓ రమణీ ఫార్ములాకి సరిపెట్టి తపస్సు చేస్తున్న వారిమీదకు తోసేసాడు. వాళ్లు వీళ్లముందు దిగి వళ్ళు విరుచుకుంటూ వళ్ళు దాచుకోకుండానూ కళ్ళు తిప్పుతూనూ శాయశక్తులా పాడేస్తూ గెంతులెయ్యడం చేసారు.

"ఓ దేవలోకపు ఆడాళ్ళూ! మేం మీకు లొంగం గాక లొంగం" అని గెంటెయ్యగా అ(డా)ళ్లు దేవతా హీరోయిన్లు వెర్రి మొహాలేసుకుని వెనక్కి అంటే పైకి అంటే వయా ఆకాశం స్వర్గలోకంలోకి వెళ్లి ఇంద్రుడికి చెప్పేశారిన్నింగ్స్ డిఫీటని, దాంతో దేవేంద్రుడు బెంబేలెత్తిపోయి బ్రహ్మగారి పాదాల మీద పడిపోయాడు.

"దేవుడివయ్యుండి మరో దేవుడి కాళ్ళమీద పడతావేం అసహ్యంగా మనిషిలా, ఆంధ్రుడిలా? సిగ్గులేదూ, పాదాభివందనం చేయడానికి? అంటూ కేకలేసి అప్పుడడిగాడు.

"ఏం పనిమీద వచ్చావు" అని ముందు ముఖంతో.

తన భయం వెళ్లబోసుకుని "మీరెళ్లి నా ఇంద్ర పదవి తప్ప మనే వరమయినా ఇచ్చెయ్యండి, ఫర్లేదు. నా ఆపదని వారిస్తే మీ నాలుగు బోళ్లకి తీపి తినిపించడమే కాకుండా నాలుగు గెడ్డాలకి షేవ్ కూడా చేయించుకుంటా"లనీ మనవి చేసుకున్నాడు ఇంద్రుడు.

"ఏడిశావులే" అనేసి బ్రహ్మగారు బర్రున క్రిందకి జారిపోయి తపస్వుల ముందు నిలిచాడు.

"మీరెవరు?" ఈ సామూహిక తపస్సేమిటి? ఎందుకు?"

"మా పద్ధతంతే. మానభంగం నుంచి మౌనపోరాటం, ఒంటరి పోరాటం వరకూ ఏదయినా సామూహికమే. ఐకమత్యమే మహాబలం. ఆంధ్రుల కైకమత్యము అని విధాత వందరవబోతూంటే, మరొక తపస్వి " మేము పురుష విమోచనా పరిషత్ సభ్యులం. స్త్రీ పురుష సమానత్వం మా ధ్యేయం" అన్నాడు.

"ఇంతకీ మీరెవరు" అని ప్రశ్నించాడు మరో తపస్వి. అతను పూర్వాశ్రమంలో పోలీసు శాఖవాడు. హోటలు గదుల్లో దిగిన నిజమైన దంపతులను కూడా భార్యాభర్తలమని నిరూపించుకోమనేవాడు. మంగళ సూత్రం చూస్తే అది నువ్వే కట్టావని నిదర్శనం చూపెట్టమనేవాడు. ఏం చెప్పినా ఎదురు ప్రశ్నే. అయితే అతనిలో ఒక సుగుణముంది. చేతిలో లంచం పడిందంటే ఇక అవతలి వాడేం చెప్పినా వేదమంత సత్య ప్రమాణంగా స్వీకరించేవాడే. ఒంటరిపోరాటం సామూహికంగా ఎలా సాధ్యమా అని సతమతమౌతున్న బ్రహ్మ- "నేను బ్రహ్మని" అన్నాడు నొక్కి వక్కాణించడమంటారే అలాగ.

"అని నమ్మకమేమిటి అసలేయివి మాయరోజులు, మారు వేషాల రోజులు" పూర్వాశ్రమంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉండుకున్న గెడ్డాల బాబు సహజంగా అడిగాడు.

"నేను మీ తపస్సుకి మెచ్చాను. వరమివ్వబోతున్నాను. ఇంక నేను బ్రహ్మనికాక మరొకరిని ఎలా కాగలను" విసుక్కున్నాడు విధాత.

వరమిస్తావా? అయితే నువ్వు బ్రహ్మవే- అని ఒప్పేసుకున్నాడతను.

"డైలాగులతో డిలే చెయ్యక మీరెందుకు తపస్సు చేస్తున్నారో చెప్పేసి తపస్సాపేసి పోతామంటే ఒకటో పదో వరాలిచ్చేసి నేను పోతాను. నాకవతల స్వర్గంలో సౌదామిని సాంగ్ కచేరీ వుంది. కనుక అధిక ప్రసంగం చెయ్యకుండా పాయింటుకో వరాలకో వచ్చేయండి"

"నీకింగ్లీషు వచ్చునే! ఇంగ్లీషు బ్రహ్మవన్నమాట" నవ్వాడొక స్వామి.

నాకే మొచ్చునో కాదు కొశ్చను. మీకేమొచ్చిందీ అనేది పాయింటు" కసిరాడు దేవుడు.

"మా దేశంలో భర్తలకి బహు అన్యాయం జరిగిపోతోంది." అన్నాడొక తాపసి.

"భర్తలంటే పురుషులు కదా?"

"ఆ మాత్రమూ తెలీకుండా బ్రహ్మవెలా అయ్యావయ్యా వెర్రి మాలోకమా" నవ్వాడొక ముని.

"తెలియక కాదు. పెద్ద అలవాటు లేక మా స్వర్గంలో పురుషులే తప్ప భర్తలరుదు. సర్లెండి. పురుషులకి జరిగిపోతున్న అన్యాయమేమిటి?"

"స్త్రీలకున్న కొన్ని ప్రివిలేజెస్ మాకు లేవు"

"వాళ్ల కుండడమూ, మీకు లేకపోవడమూ ఏది అన్యాయం?"

"రెండూనూ, సరే మాకు లేకపోవడమే"

"మచ్చుకి కొన్ని అన్యాయాలను ఏకరువు పెట్టుడు"

"ముఖ్యంగా వ్రతాలూ నోములూ"

"నోములు న్యూసెన్స్ కదా? తెల్లవారు ఝాము స్నానాలు, తడిగుడ్డలు, మడీ, డర్టీ"

"భలే బ్రహ్మ! ఇంగ్లీష్ బ్రిటిష్ బ్రెహ్మ" ఆశ్చర్యపోయాడొక మహర్షి. పోయాడంటే ఎక్కడికీ పోయాడని కాదు. అక్కడో వున్నాడు. ఆశ్చర్యపడ్డాడు అని. పడడమంటే ధామ్మని పడిపోవడం కాదు సుమా. మరెలా చెప్పాలి ఆశ్చర్యం ఐపోయాడు. అహ ఆశ్చర్యం నిలుచునే వున్నాడు.

"భక్తి కంటే ప్రసాదం కదా ప్రధానం? చాకిరొకరిది సౌకర్యమొకరిది అన్నట్లుగా వాళ్ళు చచ్చీ చెడీ నోములు పడితే పిండివంటలు స్పెషల్సూ మీక్కూడా కదా?"

"ఎంతసేపు తిండి రంధేనా? అయినా ఇంట్లో వులావుకుంటే హోటల్లో కూర్మా రుచెక్కువో కంచానికే కాదు, మంచానికీ ఇదే నగ్న సత్యం. అన్నాడొక మహర్షి.

"ఆడవాళ్ల కెన్నెన్ని నోములు? ఎన్నెన్ని వ్రతాలు!"

"మగాళ్లకు కూడా వున్నాయిగా.. వినాయక చవితిలాంటివి"

"అవి కామన్ నోములు. పైగా యూన్‌సెక్స్ కూడాను. శ్రావణమాసం వస్తే చాలు చీర! వరలక్ష్మి వ్రతానికైతే బంగారం! నోములూ చీరెలూ, నగలూ, ఆడబ్రతుక్కి అతిమధురం బ్రహ్మా! మగాడివయ్యుండి నువ్వే మగాళ్ళకెంత అన్యాయం చేసావు?"

"తెలియకుండా ఆడిపోసుకోకండి. ఆ వ్రతాలూ నోములూ అవీ సూతుడు శౌనకాది మహామునుల డిపార్ట్‌మెంట్. ఇంతకీ మీరనేదేమిటి? మీరూ స్త్రీలతో సమానంగా శ్రావణ మంగళవారాలు అవీ చేస్తామంటారా?"

"ఛఛ ఆ తతంగాలు పాట్లు మాకొద్దు. బస్సుల్లో స్త్రీలకు ప్రత్యేక సీట్లుంటాయ్. అలాగ పురుషులకి ప్రత్యేక నోములుండాలంటా. ఆ నోములు చప్పగా కాక చిక్కగా, మాంచి హుషారుగా వుండాలంటాం" ఉటంకించాడు ఒక గెడ్డాలవాడు.

"సరే మీకెటువంటి నోములు మరియు వ్రతములు కావలయునో నాకవగతమైనది. ఒక్క నిముషం మీరు నిమేషులు కండు" అని వాళ్ళ కళ్లు మూసుకోగానే.

"హాం ఫట్" అన్నాడు బ్రహ్మ గారడీవాడిలా. అతని చేతిలోకొక చిన్న పొత్తము వచ్చినది. దానిని తపస్వుల కందించి పోబోయాడు విధాత.

"అప్పుడే అంతర్ధానమైపోకు. మేమిది చదివి తృప్తి చెందేవరకూ ఉండు. లేపోతే మళ్ళీ తపస్సు చేసేస్తాం" అని బెదిరించి ఆపారు వాళ్ళు బ్రహ్మని. ఒకడు ఆ పుస్తకాన్ని చదవసాగాడు. "పురుషుల వ్రతకల్పము. దీనియందు మగవారికి మూడు నోములు కలవు."

"ఒకటవది; పదహారు సిగరెట్ల నోము; దీనిని తొల్లి సూతుడు శౌనకాది మహామునులకిట్లు వివరించెను. పుగాకు లేదా పొగాకు యనబడు పత్రము నుండి తయారుచేయబడు సిగరెట్లలో– సిగరెట్టు, చుట్ట, సిగార్ యను అనేక రకములుండును. ధూమపానము పురుషులకు అత్యంత విలాసమై యొప్పును. ఈ నోము నొకపరి చేసికొనినవారు ఆజన్మాంతమూ పాటించుచునే యుందురు. అంతగా ఆకర్షించి యలవాటుగా మారును. దీనివలన క్షయ కాన్సరు మొదలగు ప్రాణాంతక వ్యాధులువొచ్చి మనిషిని భవబంధముల నుండి త్వరగా విముక్తుడిని గావించి వయసు మీరకనే పుణ్య లోకములకు పంపును. త్వరగా దైవసన్నిధిని చేరుకొనుటకిది చక్కని రాజమార్గము. నిత్యాగ్నిహోత్ర పుణ్యము... అగ్నిదాన ఫలము వొచ్చును. వయసుతో నిమిత్తము లేక ప్రతి పురుషుడు (ఏదైనా స్త్రీలున్నూ) ఆచరించదగిన వ్రతమిది. ఈ వ్రతమున కాదియే కాని అంతముండదు – మనిషితో తప్ప. వారి చుట్టుపక్కలవారు కూడా ధూమపానమున తరింతురు.

వ్రత విధానము : ఒక శుభదినమున– ముఖము కడుగు కొనియూ కాఫీ సేవించి సిగరెట్ అంటించి– పదనారు సిగరెట్ల లేదా చుట్టల నిడుకొని చుట్టుపక్కలున్న మగవారికి ఒక్కొక్కటిచ్చును వారికి తానే అగ్గిపుల్ల వెలిగించి వారి చుట్ట లేదా సిగరెట్‌కు అగ్ని సంస్కారము చేయవలయును.

అటుల పదహారు దినముల పాటు దినమునకు పదహారు మందికి ఉచితంగా పంచవలెను.

దీనినే పదునారు సిగరెట్ల నోమని నవదశ పురాణమున పేర్కొనినారు. ఈ నోము వలన చుట్టరికము వృద్ధి యగును. దీనికి వయోనియమము లేదు. తొందరగా కైలాసమందు చేరుకొను వాంఛ కలవారికది యుత్తమ వ్రతము.

రెండవది, ఆడువారికి అట్ల తదియవలె మగవారికి చీట్లాట తదియ నోము. దీనినే పేకాట నోమని నామాంతరమున్నది. తిథివార నక్షత్ర వర్జ్య దుర్ముహూర్తముల పట్టింపులవసరము లేనిదీ నోము. తీరిక చూసుకొనినచాలు. వేళాపాళలక్కరలేదు. ఇల్లు... క్లబ్బు... ఆటల గది.. చివరకు చెట్టుకిందైననూ యీ నోము చేసుకొనవచ్చును. కాని పోలీసులు వొచ్చి నోము నాశనము చేయకుండ చూసుకొనవలెను.

వ్రతము లేదా నోము లేదా దీక్ష కవసరమగునవి–

పుష్కలముగా డబ్బు... చీట్ల పేకలు... పొట్లములతో పకోడీలు, చేగోడీలు మున్నగు చేతికంటని తినుబండారములు... ఫ్లాస్కుల కొద్దీ టీ, కాఫీలు... పెట్టెల కొద్దీ సిగరెట్లు, అగ్గిపెట్టెలు... ఈ దీక్షను సామూహికముగ పట్టవలెను. నలుగురైనను లేనిచో నిది చతుర్ముఖ పురాణమనిపించుకోదు. సీక్వెన్స్... రన్‌మోర్... బేస్తులు... అడ్డాట... జోష్పుకుక్క వంటి యనేక విధానములలో ఏ విధానమునయినను చేపట్టవచ్చును. ఒక పద్ధతి విసుగు కలిగించిన మరొక విధానమున ఆడుకొనవచ్చును. ఈ నోము వలన అధికులు దివాళా తీసి బికారులగుట ఎంత సత్యమో కొద్దిమంది బాగుపడుటయునూ అంత సత్యమే. ఈ నోము వన త్యాగఫలము లభించును. ఈ నోము పట్టినవారు కనీసము పండ్రెండు గంటలు పాటించవలెను. చీట్ల పేకలమ్మువారికి... తినుబండారముల వారికి... కాఫీ, టీల సప్లయిదారులకు...సిగరెట్టు దుకాణముల వారికి– నోముదారులు ప్రత్యక్షముగానూ, పరోక్షముగనూ ధనము నిత్తురు కనుక అవ్విధమున దాన, త్యాగ ఫలములు పొందుదురు. దీని నాచరించే (పాచికలు చీట్ల పేకలు సోదరీ సోదరులే) ధర్మరాజు పురాణ ప్రసిద్ధియు, బొందెతో కైలాస ప్రాప్తియు పొందెను. ధనమొక చోట పేరుకొని పోక నలుగురికీ పంపిణీ యగుటకీ నోము చక్కని మార్గము. నోము సమయమున నిత్య జూదరికి లాభ నష్టములు సమానము; ముక్క కలిస్తే కుక్కయినా ఆడుతుంది లాంటి సామెతలు స్మరించుచు, రన్‌మోర్ లాభాలతో రాతిమేడ కట్టించిన రాజారావ్ కథ, సీక్వెన్స్ లాభాలతో సిమెంటు మేడ కొన్న శ్రీనివాసరావ్ కథా వంటి చరిత్రలు చెప్పుకొనచుండవలెను. అప్పుడీ నోము మరింత ఉత్సాహముగనుండును. కుటుంబమున కొక్కరీ నోము పట్టినను చీట్లాట దీక్షాఫలము కుటుంబ సభ్యులందరినీ వీధి కెక్కించును. ఈ జూదలక్ష్మి నారాధించుచునే ధర్మరాజు రాజ్యమును, ఉద్యోగస్తులు కార్యాలయపు సొమ్ము వాడి ఉద్యోగములను, ఎందరో తమ ఆస్థిపాస్తులను కోల్పోయి జూద గ్రంథ పుటల కెక్కినారు. ఈ చీట్లాటకు సోదరులే. బ్రాకెట్, మట్కా, లాటరీ, షేర్లు, గుర్రప్పందాలు వగైరాలు మొదలైనవి. చివరకు పెళ్లి పందిరలందును, పండగలందునూ కూడా ఈ చీట్లాట నోము పట్టువారెందరో!

ఇక ముచ్చటగా మూడవది, నావుడు యిట్లనెను– "మధు నోము భూలోకమందే స్వర్గమును ప్రత్యక్షమొనరించు శుభోతి శుభ వ్రతమున బరగును. పురాణ కాలము కంటెను ప్రాచీనమగునీ సురాపాన వ్రతము. సుర సంతానమే సారా, బ్రాందీ, విస్కీ, రమ్ము, జిన్, బీరు వగైరాలు. సురను సేవించుట చేతనే దేవతలు సురలు అనబడిరి. ఏ రూపమున నయిననూ సురసేవ యొనరించదగును తాగి తూగి వాగి జోగినవానికి భూమి మీదనే స్వర్గ సాక్షాత్కారమగును. కల్లుపాక నుండి బారు వరకు నన్నియును మధుశాలలే. మత్తు మనిషికి మంచి చెడులను మరపించును. సిగ్గులజ్జలనూ, నీతి

నియమములను దూరము చేయును. అకృత్యములను చేయించు సాహసము నివ్వగలిగినది సుర. యజ్ఞ యాగాదులందును దీనికి ప్రత్యేక స్థానము కలదు. క్షుద్రము, బుద్బుదప్రాయమునగు జీవితము నుండి మానవుని సమాధిస్థితికి గొనిపోవగల నేర్పరి ఇది. దీనికిని వేళాపాళలు లేకపోయినను అనువగు సమయము చీకటిపడిన తరువాతే. కల్లును మాత్రము మధ్యాహ్నము సేవించవచ్చును. తాగినచో వెర్రివాడు కూడా వేదాంతము చెప్పును. వినువాడున్ననూ లేకపోయిననూ, సురాపానము మాంస భక్షణమునకును ఆ పిదప మగువ పొందునకును దారితీసి మనుజుని పూర్తిగా కోతిని వలెయాడించును. దీని పాలబడినవారుఎంతటి వారైననూ త్వరలోనే పతితులు కావలసినదే.

చషక మీకుము– దోసిట చాలు నాకు" అని గాలిబ్, 'ఒక్క పెగ్గు బిగించి, రెండు శ్రీలు ధరించి' అని శ్రీశ్రీ చేతనూ కవితలు వ్రాయించినదీ మధుపాన విశిష్టే. 'మొదట మీరు మధువును తాగుతారు, తరువాతఅది మిమ్మల్ని తాగుతుంది" అన్న నానుడి నిస్సందేహముగ నిక్కము. 'ఇద్దరాడవాళ్ళు కలిస్తే వాగుతారు, ఇద్దరు మగవాళ్ళు కలిస్తే తాగుతారు" అనేది నేటి కాలపు నీటునిజము. ఒక్క తాగుబోతు చాలు ఊరిని చెడగొట్టడానికి. కల్లుకైతే తాటిదొప్పి. సారాకయితే గ్లాసూ సోడా, విస్కీ వగైరాలకు ఐసూ, సోడా గాజుగ్లాసులు మాచింగు, అలా సేవించాలి. సంపూర్ణ ఫలితానికి మధుసేవ ఎంత గొప్పది కాకపోతే 'తీస్కోరమ్మా సోడా... ఏస్కోరమ్మా కోకాకోలా" వంటి ఎన్నెన్ని పాటలందుకో గలిగింది! కాలేయము, గుండె... రక్తప్రసరణం... మెదడు.. దేనినైనా నాశనం చేసి అల్పమైన జీవితం నుంచి అతిత్వరలో మానవుని పైకి పంపగలిగిన మహత్తర వ్రతమీ మధుసేవ– మన వేరే వివరించవలెనా?

ముక్తాయింపు : పై మూడును మగవారి వ్రతములే ఐనను, స్త్రీలసీట్లలో కొందరు మగవారు కూర్చొన్నట్లే వ్రతములను కొందరు స్త్రీలననుసరించినను ఆగ్రహము చెందరాదు. మంగళం మహత్– శ్రీశ్రీశ్రీ పురుషుల వ్రతకల్పము సమాప్తము–" అని ముగించాడు చదువరి, వహ్వా, ఆహా! సెభాషో! అంటూ మెచ్చేసుకున్నారు.

'అమ్మయ్యో!' అనుకుంటూ బ్రహ్మయ్య మేఘాల్లోకి అంతర్ధానమైపోయాడు. ఆనాటినుంచి మగవాళ్ళు మరింతగా ఈ మూడునోముల వెంట పడుతూ శాయశక్తులా పతనమౌతూనే ఉన్నారు.